## మంకెన సీతారామయ్యకు
# ఘన నివాళులు



**చింతకాని, కెరటం న్యూస్ ప్రతినిధి**

బీఆర్ఎస్ జిల్లా నాయకులు, రైతు బంధు సమితి జిల్లా బాధ్యులు మంకెన రమేష్ సోదరుడు మంకెన సీతారామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో గురువారం పలువురు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు, వారి బంధు మిత్రులు మండల పరిధిలోని నేరడ గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమానికి మధిర మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, చింతకాని మండల ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంకాయలపాటి వెంకటలచ్చయ్య, గౌడ సంఘం జిల్లా నాయకులు దూసరి శ్రీరాములుగౌడ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జిల్లా మండల నాయకులు పాల్గొని మంకెన సీతారామయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సీతారామయ్య తాను జీవించినంత కాలం ఎవరికీ ఏ రకమైన హాని తలపెట్టలేదనీ, ఆదర్శవంతమైన జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. అందరినీ కలుపుగోలుగా మాట్లాడే వ్యక్తి అనీ, అనారోగ్యం సీతారామయ్యను మరణపు అంచుల్లోకి తీసుకెళ్లిందన్నారు. పేదలకు నిత్యావసరాలు అందించే చౌకదుకాణం ద్వారా పేదలకు బియ్యం పంపిణీతో అందరి మనసుల్లో స్థానం సంపాదించుకున్నారని అన్నారు. మంచి మనసున్న సీతారామయ్య అకాలమరణం చెందడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకు నిత్యశాంతి కలగాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మృతుడు మంకెన సీతారామయ్య కుటుంబాన్ని పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంకెన రమేష్, స్థానిక నాయకులు, గ్రామస్తులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.





## వైద్యులపై దాడులు అరికట్టేలా
# కేంద్రం చట్టం తేవాలి

**వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఇటీవల కలకత్తాలో జరిగిన మెడికల్ పీజీ విద్యార్థిని దారుణ హత్య యావత్ దేశాన్ని కలచివేసిందనీ, డాక్టర్లపై దాడులు అనేక సందర్భాలలో యదేచ్ఛగా జరుగుతున్నాయనీ, హాస్పిటల్లపైనా, వైద్యులపైనా నిత్యకృత్యమైన దాడులు నివారించేందుకు గాను పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఐఎంఏ అధ్యక్షులు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా.కంభంపాటి నారాయణ రావు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డా. కంభంపాటి నారాయణ రావు దేశవ్యాప్తంగా వైద్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంపీ రఘురామి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కలకత్తా ఘటన దేశంలోని మహిళల భద్రతను ప్రశ్నిస్తోందన్నారు. పని ప్రదేశంలోనే, అతిపెద్ద హాస్పిటల్‌లో ఇంత దారుణ ఘటన జరిగిందంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో తెలుస్తోందన్నారు. కలకత్తా ఘటన తరువాత మహిళా వైద్యులు ఆందోళన చెందుతున్నారని గుర్తుచేశారు. నర్సులు, మహిళా వైద్యులు, ల్యాబ్ సిబ్బంది, హాస్పిటల్‌లో సహాయకులు ఇలా అనేక మంది మహిళా ఉద్యోగులు రాత్రివేళ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని వారికి రక్షణ కల్పించాలంటే దాడులకు, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా కఠినమైన శిక్షలు అమలుచేస్తేనే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని డా.కంభంపాటి నారాయణరావు సూచించారు. పార్లమెంటులో ఈ విధమైన చర్చ జరగాలని ఎంపీ రఘురామిరెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురామి రెడ్డి మాట్లాడుతూ..కలకత్తా ఘటన మానవసమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. మహిళా వైద్యురాలి మృతి దారుణమైన ఘటన అన్నారు.ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా ఉండాలంటే పార్లమెంటులో కఠిన మైన చట్టాలు రూపొందించేలా తన వంతుగా పార్లమెంటు దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.